క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కారెంపూడి: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈఈ కోట పెదమస్తాన్ శుక్రవారం ఒక ప్రటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కరెంట్ ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పిడుగురాళ్లలో..

పిడుగురాళ్ల: విద్యుత్ మరమ్మతుల నిమిత్తం పట్టణంలో శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ బి.పోతురాజు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కోత ఉంటుందని చెప్పారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

ఒప్పిచర్లలో ఎరువులు పంపిణీ



కారెంపూడి: త్వరలో యూరియాతో పాటు అన్ని రకాల ఎరువులు అందుబాటులోకి వస్తాయని మండల వ్యవసాయశాఖ అధికారి పి.నరసింహారావు తెలిపారు. మండలంలోని ఒప్పిచర్లలో శుక్రవారం యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు అవసరం మేరకు మాత్రమే ఎరువులు తీసుకెళ్లాలని సూచించారు.

ఎన్నెస్పీ కాలువలో గుర్తు తెలియని మృతుడు

వినుకొండ: గుర్తుతెలియని యువకుడి మృతదేహం పట్టణంలోని కస్తూర్బా స్కూల్ వద్ద గల ఎన్‌ఎస్‌పీ కెనాల్‌లో లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుమారు 25 సంవత్సరాల నుండి 30 సంవత్సరాల వయసు గల వ్యక్తి మృతిచెంది కాలువలో పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. మృతదేహంపై స్కైబ్లూ కలర్ చొక్కా, లైట్ కాఫీ కలర్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. సదరు వ్యక్తి వివరాలు తెలిసినచో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

ఇరువురు గంజాయి విక్రేతల అరెస్టు

నాదెండ్ల: గణపవరం పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు గంజాయి విక్రయిస్తున్న ఒడిషాకు చెందిన ఇరువురిని శుక్రవారం నాదెండ్ల పోలీసులు అరెస్టు చేశారు. చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బానాయుడు, ఎస్సై జి.పుల్లారావు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒడిషా రాష్ట్రానికి చెందిన ఉత్తమ్ మాలిక్ గణపవరంలోని శివస్వాతి స్పిన్నింగ్ మిల్లులో కార్మికుడిగా పనిచేస్తూ అక్కడే క్వార్టర్స్‌లో నివశిస్తున్నాడు. ఇదేరాష్ట్రానికి చెందిన బులు బెహెరా ప్రసన్నవంశీ స్పిన్నింగ్ మిల్లులో పనిచేస్తూ క్వార్టర్స్‌లో నివా సం ఉంటున్నాడు. ఇరువురు కలిసి గంజాయిని విక్రయిస్తున్నారు. పక్కా సమాచారం తెలుసుకున్న పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 700 గ్రాముల గంజాయి, రూ.400లు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

దంత సంరక్షణతోనే ఆరోగ్య రక్ష



చిలకలూరిపేట: దంత సంరక్షణతోనే ఆరోగ్య సంరక్షణ సాధ్యమౌతుందని రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం అధ్యక్షుడు బోనం వెంకటేశ్వరరావు చెప్పారు. మండలంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు దంతవైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తినే ఆహారాన్ని చక్కగా నమిలి మింగేందుకు ఆరోగ్యకరమైన దంతాలు కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న దంత వైద్యులు డాక్టర్ పేర్ని కృష్ణమోహన్ దంతాలను ఎలా శుభ్రపరుచుకోవాలి, వాటిని ఎలా సంరక్షించుకోవాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు కొల్లా సుబ్బారావు, చెంచు పున్నయ్య, రాఘవయ్య, పుల్లయ్య పాల్గొన్నారు.

నాదెండ్లలో ప్రాంగణ ఎంపికలు

నాదెండ్ల: గణపవరం చుండి రంగనాయకులు డిగ్రీ కళాశాలలో శుక్రవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఫ్లక్సిటిక్ కంపెనీ మేనేజర్లు చంద్రశేఖర్, రమేష్, గోపీనాధ్‌లు ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులకు రాతపరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలో కుమారి దేవివరప్రసాద్, వెంకటఝాన్సీ, రాహేలమ్మ, ఎండీ రఫీ, వి.అఖిల, కె.ధనుంజయ్‌కుమార్, జె.మౌనిక, ఆర్.సాయిస్పజన, పి.శైలజ ఎంపికయ్యారు. ఎంపికైన తొమ్మిది మంది విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చుండి వేణుగోపాల్, డైరెక్టర్ రంగనాయకులు, ప్రిన్సిపల్ మనోహర్, అధ్యాపకులు నిరంజన్, చైతన్య అభినందించారు.

ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

నరసరావుపేట టౌన్: ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని టూటౌన్ ఎస్‌ఐ అశోక్ తెలిపారు. టూటౌన్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు.





గుంతలరోడ్డు నడక యాతన

రోడ్లు అధ్వానంగా మారాయి. కొద్దిపాటి వర్షానికి వాటి అసలు రంగు బయటపడుతుంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రోడ్లు తీర్చిదిద్దామని చెబుతున్నా.. ఎక్కడ కనిపించడం లేదు. పిడుగురాళ్ల- కారంపూడి ప్రధాన రహదారిలో జానపడు వరకు రోడ్డు గుంతల మాయమైంది... రైల్వే గేటు దాటిన దగ్గర నుంచి జానపాడు ఎస్సీ కాలనీ చర్చి వద్దకు సుమారు 30 గోతులు పైగా ఉన్నాయి... ఈ రెండు కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాలంటే వాహనదారులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. నిత్యం వందలాది వాహనదారులు ఇదే రోడ్డు మీదగా జానపాడు మీదగా పందిటివారిపాలెం, జూలకల్లు, గుత్తికొండ, కారంపూడి, వినుకొండ గ్రామాలకు నిత్యం రాకపోకలు సాగించాలి. -పిడుగురాళ్ల రూరల్

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కేసులు

రూ.8.72 లక్షల అపరాధ రుసుం వసూలు

పిడుగురాళ్ల: విద్యుత్ వినియోగదారులు నిబంధనలకు విరుద్ధంగా కరెంట్ వినియోగిస్తే విద్యుత్ చౌర్యం కేసు నమోదు చేస్తామని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సింగయ్య పేర్కొన్నారు. పట్టణంలోని విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ తనిఖీల్లో 60 మంది అధికారులు, 185 మంది సిబ్బంది 60 బృందాలుగా ఏర్పడి 5,478 సర్వీసులను తనిఖీ చేసినట్లు వివరించారు. మొత్తం రూ.8.72 లక్షల అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. అందులో మీటరు లేకుండా డైరెక్టుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న కరికి రూ.0.05 లక్షలు, మీటర్ ఉన్నప్పటికి అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులకురూ.0.15 లక్షలు, అనుమతించిన కేటగిరి కాక ఇతర కేటగిరిలో విద్యుత్ వాడుకుంటున్న ఆరుగురు వ్యక్తులకు రూ.0.40 లక్షలు, అనుమతించిన లోడు కంటే అదనరగా విద్యుత్ వాడుతున్న 107 మందికి రూ.7.79 లక్షలు, అసలైన వాడకం కంటే బిల్లులు తక్కువగా ఇవ్వబడిన ఒకరికి సర్వీసు గుర్తించి రూ. 0.15 లక్షలు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. విద్యుత్ సర్వీసుల తనిఖీలు భారత్ విద్యుత్ చట్టానికి లోబడి ఉంటాయని చెప్పారు. వినియోగదారులందరూ తమ విద్యుత్ మీటర్లకు తప్పనిసరిగా సీలు ఉండేటట్టు నిర్ధారించుకోవాలని, ఒక వేళ సీలు లేకపోయినా, తుప్పు పట్టి ఊడిపోయినా, వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బందికి రాతపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. ముఖ్యంగా సాగర్ తీర ప్రాంతాలలోని మీటర్లకు ఉన్న సీలు త్వరగా పాడయ్యే అకాశం ఉందని చెప్పారు. సీలు లేకపోయినా, ఊడిపోయినా, గాల్లు పెట్టినా, తొలగించినా విద్యుత్ చౌర్యం కింద కేసు నమోదు చేయటం జరుగుతుందని హెచ్చరించారు. పని చేయని మీటర్ నుంచి విద్యుత్ వాడుకున్నా, ఉండాల్సిన మీటరుకు బదులు వేరే మీటర్ పెట్టి సీలు లేకపోయినా విద్యుత్ చౌర్యంగా నమోదు చేస్తామని వివరించారు. మొదటి తప్పులో కాపౌండింగ్ పద్ధతిలో అపరాధ రుసుం విధించటం జరుగుతుందని, రెండో తప్పిదంలో అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించటం జరుగుతుందన్నారు. కట్టలేని పరిస్థితుల్లో రికవరీ చట్టం కింద ఆస్తులు జప్తు చేయటం జరుగుతుందని పేర్కొన్నారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారి వివరాలు తెలపాల్సిన నంబర్ 94408122263, 8639741050 నేరుగా లేదా వాట్సాప్ ద్వారా సమాచారం ఇవ్వాలని కోరారు. దాడుల్లో డీఈఈ బి.నాగసురేష్‌బాబు, డీపీఈ(విజిలెన్స్) డీఈఈ కె. రవికుమార్, ఎస్.మల్లికార్జున ప్రసాద్, ఎస్.శ్రీనివాసరావు, ఏఈలు బి.పోతురాజు, ఏఈఈ కె.కోటేశ్వరరావు, ఎం.సతీష్ కుమార్, యు. శివశంకర్ పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

హెచ్‌ఎం వసంతకుమారిని ఆదర్శంగా తీసుకోవాలి

మంచికల్లు(రెంటచింతల): గ్రామంలోని పేద విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు వారి ఆర్థిక, సామాజిక అవసరాలను గుర్తించి అండగా ఉంటూ ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయురాలు వీర వసంతకుమారిని ఆదర్శంగా తీసుకోవాలని ఎంఈఓ-2 వై.శివనాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం పాఠశాలలో తొమిదేళ్ల హెచ్‌ఎంగా అంకితభావంతో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న నంబూరి వీర వసంత కుమారికి అభినందన సభ నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ వేసవికాలంలో కూడా వీర వసంత కుమారి గ్రామంలోని బడిఈడు పిల్లల కోసం ఇంటింటికి వెళ్లి చదువుకోవడం వలన కలిగే ప్రయోజనాలను తల్లిదండ్రులకు వివరించి ఆ పిల్లలను పాఠశాలలో చేర్పించి వారందరి మనస్సులలో చెరగని ముద్రవేశారని గుర్తు చేశారు. పాఠశాలలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటుతో పాటు విద్యార్థులకు కనీస వసతుల కల్పనకు గ్రామస్తులను భాగస్వాములను చేసి ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచి గోగుల పుల్లారెడ్డి, హెచ్‌ఎం సిలార్ అహ్మద్, పాఠశాల ఎస్‌ఎంఎస్‌సీ చైర్మన్ జానకి, పాలువాయి క్లస్టర్ హెచ్‌ఎం కత్తి రవి, ఉపాధ్యాయులు శారదా, వెంకటేశ్వర్లు, సాయి భాస్కర్, అమహ్మద్, జానీ, నాగరాజు, మాధవ రావు, బ్రహ్మయ్య, రామకృష్ణ, ప్రమీల, లక్ష్మి, శిరీషా, రమ్య, యామిని, వెంకటేష్, కోటేశ్వరరావు, నాసరయ్య పాల్గొన్నారు.



వీరవసంతను సన్మానిస్తున్న ఎంఈఓ శివనాగేశ్వరరావు

హెచ్‌ఐవీపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

పిడుగురాళ్ల: పట్టణంలోని తిరుమల ఆక్స్‌ఫర్డ్ జూనియర్ కాలేజీలో హెచ్‌ఐవీపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ హెచ్‌ఐవీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. సమాజంలో ఉన్న అపోహలను తొలగించాలన్నారు. చేతులు కలపడం, భోజనం పంచుకోవడం, దోమలు కాటు వంటి కార్యకలాపాల ద్వారా హెచ్‌ఐవీ వ్యాప్తి కాదని తెలిపారు. ప్రారంభ దశలోనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయంచడం, డాక్టర్ సూచించిన చికిత్సను పూర్తిగా తీసుకోవడం, పరిశీలించిన రక్తం లేదా రక్త ఉత్పత్తులను మాత్రమే వాడడం, శుభ్రమైన లేదా కొత్త సూదులతో ఇంజెక్షన్లు తీసుకోవడం, గర్భిణులు వైద్యుల సూచనల మేరకు హెచ్‌ఐవీ పరీక్ష చేయించుకోవడం వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో రీడ్స్ అవుట్ రీచ్ వర్కర్లు శేషయ్య, చెన్నమ్మ, జ్యోతి, కాలేజీ ప్రిన్సిపాల్ నరేష్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సభ్యులు

సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ వినతి

కారెంపూడి: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ నిరసన వారంలో రెండవ రోజు కారెంపూడి శాఖ నాయకులు శుక్రవారం తమ సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ ఆర్.వెంకటేశ్వర్లు నాయక్‌కు వినతి పత్రం సమర్పించారు. ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు వి వెంకటేశ్వర్లు నాయక్ ఇప్పటికి నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. యూనియన్ నాయకులు జి.భాస్కరరావు, జి.శ్రీనివాసరావు, ఎ.విజయ్‌కుమార్ రెడ్డి, ఎండీ షకీల్ అహ్మద్ పాల్గొన్నారు.

మాచర్లలో నిరసన

మాచర్ల రూరల్: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం అలసత్వాన్ని వీడి పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వీవీ రవికుమార్, ఉపాధ్యక్షులు కె.కృష్ణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యా సమస్యల పరిష్కారం కోసం ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికలకు ముందు కూటమి నాయకులు ఎన్నికలలో హామీ ఇచ్చి ఇప్పటికి వరకు ఒక్క సమస్య కూడా పరిష్కరించలేదన్నారు. ఉద్యోగులకు ఇస్తామన్న డీఏ, పీఆర్సీ కమిషన్ ఏర్పాటు ఐఆర్ ప్రకటన సీపీఎఫ్ రద్దు వంటి డిమాండ్లను అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పిచ్చెయ్య, సుభాష్ చంద్రబోస్, కృష్ణానాయక్, రమేష్‌బాబు, అమర వెంకటేష్, పెన్షనర్స్ నాయకుల చంద్రయ్య పాల్గొన్నారు.



తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్‌కు వినతి పత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

రాష్ట్రస్థాయి పోటీలకు వేల్పూరు విద్యార్థులు

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి కళాత్సోవ పోటీలను బోయపాలెం డైట్ సెంటరులో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద పూర్వ విద్యార్థుల కమిటీ చైర్మన్ సంద్రపాటి చలపతిరావు మాట్లాడుతూ లఘు నాటిక (విక్రమార్కుడు-బేతాలుడు) పోటీల్లో సాయికృష్ణ టీం, స్టోరీ టెల్లింగ్‌లో ఉగ్గు కథ విధానంలో చెప్పినటువంటి కథకు శ్రీహేమలత టీం మొదట బహుమతులు రెండు టీం సభ్యులు సాధించారు. జానపద నృత్యంలో 17 పోటీలు జరుగగా వేల్పూరు విద్యార్థులు ద్వితీయ బహుమతి సాధించినట్లు తెలిపారు. అక్షయ టీం పోటీల్లోని పాల్గొన్న విద్యార్థులు దివ్యా సంజయ్,అశోక్, యశస్విని,ప్రసన్నలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ సుభాని, విద్యా కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, గైడు టీచరు జ్యోతి శ్రీనివాసరావులు అభినందించారు. బహుమతి ప్రధానోత్సవం కార్యక్రమంలో పల్నాడు జిల్లా డిప్యూటీ డీఈవో షేక్ సుభాని అవార్డులు ప్రశంసా పత్రాలు అందుకున్నారు.

అనుగురాజు విగ్రహావిష్కరణకు తరలిరండి

మాచర్ల రూరల్: అఖండ పల్నాడు రాజ్య వ్యవస్థాపకుడు అనుగురాజు యాదవ్ చరిత్ర దేశ ప్రజలకు తెలిపేందుకు ఏర్పాటు చేయనున్న విగ్రహావిష్కరణకు యాదవులంతా పెద్ద ఎత్తున తరలి రావాలని పిడుగురాళ్ల జెడ్పీటీసీ సభ్యులు జంగా వెంకట కోటయ్య పిలుపునిచ్చారు. మాచర్ల యాదవ సంఘ కార్యాలయంలో కరపత్రాలు శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పల్నాడు రాజ్యాన్ని స్థాపించి సుపరిపాలన అందించి మన ప్రాంతానికి దేశ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చిన అనుగు రాజు విశిష్టతను భావితరాలకు తెలిసేలా ఈ నెల 28న పిడుగురాళ్ల పట్టణంలో విగ్రహ ప్రతిష్ట జరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి పార్టీలకతీతంగా యాదవులంతా పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకుల ఆవుల జనార్ధనరావు, బొంబోతుల శ్రీనివాసరావు, పేర్ల పుల్లారావు, గాదె రామకృష్ణారావు, మాజీ ఏజీపీ గొర్రె వెంకటేశ్వర్లు, న్యాయవాదులు పేర్ల వెంకటేశ్వర్లు, గంగుల శ్రీనివాసరావు, రాజబోయిన మధు యాదవ్, గుండాల సైదులు, శ్రీను, గుమ్మడి నాసరయ్య పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న యాదవ సంఘ నాయకులు

యూరియా అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

వ్యవసాయ సహాయ సంచాలకులు కె.వి. శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్: యూరియాను ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని వ్యవసాయ సహాయ సంచాలకులు కె.వి. శ్రీనివాసరావు హెచ్చరించారు. ఏడీఏ కార్యాలయంలో శుక్రవారం పట్టణంలోని హోల్‌సేల్, రిటైల్ డీలర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ హోల్‌సేల్ డీలర్లు యూరియాను రిటైల్ డీలర్లకు ఎంఆర్‌పి ధరకే విక్రయించాలని తెలిపారు.

సబ్ డివిజన్ పరిధిలోని రిటైల్ డీలర్లు యూరియాను అధిక ధరకు విక్రయిస్తే ఎరువుల చట్టం 1985 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రసాయన ఎరువులను ఇతర జిల్లాలకు తరలించకుండా జిల్లాలోని రిటైల్ డీలర్స్‌కు మాత్రమే హోల్‌సేల్ డీలర్లు సరఫరా చేయాలని ఆదేశించారు. రైతులు అడిగిన రసాయన ఎరువులు మాత్రమే వారికి విక్రయించాలని, యూరియా అడిగిన రైతులకు దానితో పాటు కాంప్లెక్స్, డీఏపీ లింక్ పెట్టి విక్రయించవద్దని సూచించారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి ఐ.శాంతి, వ్యవసాయ విస్తరణ అధికారి కె.బ్రహ్మయ్య పాల్గొన్నారు.



డీలర్లతో సమావేశమైన ఏడీఏ

శాలివాహన సంఘ సమస్యల పరిష్కారానికి కృషి



చిలకలూరిపేటటౌన్: శాలివాహనుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానంటూ ఆ సంఘం జిల్లా అధ్యక్షులు తొర్లకొండ చిన్న అంజయ్య చెప్పారు. పట్టణంలోని శాలివాహన కుమ్మరి సంఘం ఆత్మీయ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సంఘం జిల్లా అధ్యక్షులు తొర్లకొండ చిన్న అంజయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా కొమరవల్లిపాడు సొసైటీ మాజీ అధ్యక్షులు కొండవీటి ఆంజనేయులు మాట్లాడుతూ తమ కుల సంఘానికి కమ్యూనిటీ భవనం, కుండల తయరీకు అవసరమైన యంత్ర పరికరాలు, మట్టి సమస్యలు ఉన్నాయని తెలిపారు. మాజీ కౌన్సిలర్ నిడమానూరు హనుమంతరావు మాట్లాడుతూ అంతరించిపోతున్న కులవృత్తిని ఆదుకోవడానికి ప్రభుత్వం ద్వారా సహాయ సహకారాలు అందించాలని విన్నవించారు. అలాగే పట్టణంలో తమ కులానికి చెందిన కవయిత్రి మొల్లమాంబ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కూడా కోరారు. అనంతరం జిల్లా అధ్యక్షుడిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాంపల్లి బాబు, రమేష్, బి.వెంకటేశ్వర్లు, సింగరకొండ బాజీ, బాబు మహేష్ పాల్గొన్నారు.

అగ్రహారం భూములపై హక్కులు కల్పించాలి

జిల్లా రైతు సంఘం అధ్యక్షులు గోపాలరావు

నూజెండ్ల: పోరాటాల ద్వారానే అగ్రహారం భూములపై హక్కులు సాధించుకోవచ్చని జిల్లా రైతు సంఘం అధ్యక్షులు గోపాలరావు సూచించారు. మండలంలోని గొల్లపాలెం, తిమ్మాపురం, వి.అప్పాపురం గ్రామాల్లో శుక్రవారం రైతు సంఘం నాయకులు సదస్సులు నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు హనుమంత రెడ్డి అధ్యక్షతన అగ్రహారం భూముల రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండ్రప్రోలు గ్రామంలో ఏర్పాటు చేసిన సదస్సులో అగ్రహారం భూముల పోరాట కమిటీ అధ్యక్షులుగా వావిలాల గురుస్వామి, కార్యదర్శులుగా నాగిరెడ్డి రామిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం అధ్యక్షులు గోపాలరావు మాట్లాడుతూ అగ్రహారం రైతుల భూ సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గమని అన్నారు. మండల పరిధిలోని 6200 ఎకరాలు అగ్రహారం భూములు ఉండగా అనుభవంలో ఉన్న రైతులకు వారి యాజమాన్య హక్కులు కల్పించడానికి ప్రభుత్వాలు, రెవెన్యూ అధికారులు, స్థానిక నాయకులు చిత్తశుద్ధి చూపటం లేదని విమర్శించారు. సర్వే పూర్తి అయినప్పటికీ పట్టాలు, పాస్ పుస్తకాలు ఇవ్వకుండా రెవెన్యూ అధికారులు సాకులు చూపుతున్నారని విమర్శించారు. సాగుదార్లకు వెంటనే హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల రైతు సంఘం నాయకులు సత్యనారాయణ, మార్కాపురం అల్లూరిరెడ్డి, కంచుమాటి తరిపాలు, ఆవూరి శ్రీనివాసరెడ్డి, అమరా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ప్రదర్శనలో పాల్గొన్న గోపాలరావు, రైతులు

బీసీలకు కూటమి ఇచ్చిన హామీలు అమలు చేయాలి

కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించిన బీసీ సంక్షేమ సంఘ నాయకులు

నరసరావుపేట: రాష్ట్రంలోని బీసీలకు కూటమి నాయకులు 2024 ఎన్నికలలో ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన ఎన్నికల వాగ్దానాలు వెంటనే అమలు పర్చాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ ఎ.మురళికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను మాట్లాడుతూ బీసీలకు కావాల్సిన రక్షణ చట్టం, స్థానిక సంస్థల ఎన్నికలలో 33 శాతం రిజర్వేషన్లు, చట్టసభ ఎన్నికలలో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు, రాజధాని అమరావతిలో మహాత్మ జ్యోతి రావు, సావిత్రిబాయి పూలేల స్మృతివనం ఏర్పాటు చేయాలనే ఐదు ప్రధాన డిమాండ్లపై బీసీ సంఘం తరపున వినతిపత్రం సమర్పించటం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడుస్తున్న ఇంతవరకు ఆ ఊసే ఎత్తటం లేదని అన్నారు.



కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ మురళికి వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంక్షేమ సంఘ నాయకులు

గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

చిలకలూరిపేట: గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పలువురు ప్రజాసంఘాల నాయకులు చెప్పారు. ఇటీవల ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియమితుడైన బి.శ్రీనునాయక్‌ను పట్టణంలోని బీసీ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మద్దుల వెంకటకోటయ్య గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు పీఎల్‌పీ యాదవ్, కె.నాగేశ్వరరావు, జి.బాలసుబ్రమణ్యం, బి.శ్రీనివాసరావు, టి.వెంకట నగేష్ పాల్గొన్నారు.


30తో ఈ-క్రాప్ నమోదుకు తుది గడువు

శావల్యాపురం: స్థానిక రైతుసేవా కేంద్రంలో మండల స్థాయిలో వీఏఏలకు ఈ-పంట నమోదు ఎరువులు పంపిణీపై సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఏఓ రామినేని రామారావు మాట్లాడుతూ ఖరీఫ్ సీజనులో సాగు చేసిన పంటలకు సంబంధించి సమగ్ర వివరాలు ఈ-క్రాప్ నమోదుకు తుది గడువన్నారు.

సాగర్ బాబు కుటుంబానికి న్యాయం చేయాలి

నరసరావుపేట: కారెంపూడి మండలం పెదకోదమగుండ్లలో కరెంటు రీడింగ్ తీసుకునే వర్ల సాగర్ బాబుని వికలాంగుడిగా మార్చి పట్టించుకోని లైన్‌మెన్, అసిస్టెంట్ లైన్‌మెన్‌లపై చర్యలు తీసుకోని అతని కుటుంబానికి న్యాయం చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మార్కెట్‌యార్డు ఆవరణలో కరపత్రం ఆవిష్కరించారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడుతూ దళితుడైన వర్ల సాగర్ బాబుని వెంకటేశ్వర స్వామి రథోత్సవం జరగబోతుందని బలవంతంగా స్తంభం ఎక్కించడంతో కరెంట్ షాక్ కొట్టి పైనుంచి కింద పడి చేతులు, కాళ్లు పడిపోయి వెన్నుపూస విరిగిపోయిందన్నారు. అప్పటి నుంచి మంచానికే పరిమితం కావటంతో అతని కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ రోడ్డున పడిందన్నారు. విద్యుత్‌శాఖ పై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా న్యాయం జరగలేదని అన్నారు.

ప్రపంచ శాంతి మనందరి లక్ష్యం కావాలి



చిలకలూరిపేట: ప్రపంచ శాంతి ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని ఆవాజ్, అభ్యుదయ ప్రజా సంఘాల నాయకులు చెప్పారు. పట్టణంలోని కళామందిర్ సెంటర్‌లోని మసీదు వద్ద ఆవాజ్ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి వర్ధిల్లాలి... సామ్రాజ్య వాదం నశించాలి అనే నినాదంతో శుక్రవారం మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాజాలో శాంతి స్థాపన కోసం ప్రపంచ దేశాలు కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. యుద్ధం, హింసావాదంతో సాధించేది ఏమి ఉండదని, మహాత్ముడు చూపిన శాంతి మార్గంలో నడవడం ద్వారా సమాజం ప్రశాంతంగా ఉంటుందని వెల్లడించారు. ఇజ్రాయిల్ యుద్ధోన్మాదన్ని వ్యతిరేకిస్తూ భారతదేశం పాలస్తీనాకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఆవాజ్ సంస్థ సభ్యులు, ముస్లింలు పాల్గొన్నారు.